నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం

షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనొ-పెడ్రొ మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్

బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలిం ది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డట్టైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్‌ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.

హర్మన్ (15)

దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ప్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరపున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రొస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహుహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ప్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ప్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ప్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ టపటప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్‌ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ప్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)

భారత్ : 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహుహు 3/15)

సఫారీల శుభారంభం

- **వెస్టిండీస్‌పై ఘనవిజయం**

లబ (4/29)

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకొ లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

భారత షూటర్లకు మరో స్వర్ణం

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్

లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్ పోటీలకు పారమిత విద్యార్థి

సాకేత్‌ను అభినందిస్తున్న పారమిత విద్యా సంస్థల అధినేత డా ఇ ప్రసాదరావు

కొత్తపల్లి, అక్టోబర్ 04: ఏపీలోని అరకులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 4 నుంచి 11 వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ పోటీలకు మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జీ సాకేత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో ప్రతిభ చూపి, ఆల్ ఇండియా ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని, విద్యా సంస్థల అధినేత ప్రసాదరావు, డైరెక్టర్లు అభినందించారు.

యునెస్కో సదస్సుకు హుజూరాబాద్ డిగ్రీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్

డా.మల్లారెడ్డి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 4: ఉజ్బెకిస్తాన్ రాజధాని తష్కెంట్‌లోని అల్ఫ్రాగానస్ విశ్వవిద్యాలయంలో 10,11న జరుగబోయే ఆసియా-పసిఫిక్ విద్యా సదస్సుకు హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఎంపికయ్యారు. సదుస్సులో ఆయన వ్యవస్థాపక వి ద్య(ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్)లో యువత సంక్లిష్ట సవాళ్లను అధిగమించి, విజయవంతమైన భవిష్యత్తును ఎలా రూపొందించుకోవచ్చనే అంశాలపై వివరించనున్నారు. మాల్లారెడ్డి ఎంపికపై తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డా.కె. సురేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా ఇందిరాదేవి, అకాడమిక్ సమన్వయకర్త కే లింగారెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎల్ఎం టీం పర్యటన

శంకరపట్నం, అక్టోబర్ 4: ఎరడపల్లి, చింతగుట్ట గ్రామాలలో శుక్రవారం ఎన్ఎల్ఎం టీం అధికారులు ఎన్ రాజేశ్, అఖిల్ మోన్ పర్యటించారు. ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పింఛన్ల రకాలు, వాటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా, పంపిణీ విధానాలను పరిశీలించారు. ఐకేపీలో స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఏర్పడిన సంవత్సరం, వాటి లింకేజీలు, తదితర అంశాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఆర్‌డీఓ శ్రీధర్, ఏపీడీ క్రిష్ణ, డిప్యూటీ సీఈఓ పవన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభాకర్, ఎస్‌బీఎం కోఆర్డినేజర్ రమేశ్, ప్లాంటేషన్ మేనేజర్ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఏపీఓ శారద, ఏపీఎం సుధాకర్, ఎన్ఆర్ ఈజీఎస్ విజిలెన్స్ అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, ఈసీ అంజయ్య, టీఏలు అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులను ఖండించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 4: మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, సర్వోదయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నరాల వీణ కోరారు. నగరంలోని కట్టరాంపూర్‌లో ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం లింగాధారిత హింస నివారణపై మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. మహిళలు, చిన్నారులు, యువతులపై జరుగుతున్న దాడులు, హింసను నివారించేందుకు సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. మహిళల్లో చైతన్యం ద్వారా మాత్రమే వీటిని అరికట్టే అవకాశముంటుందన్నారు. సమావేశంలో సమాఖ్యకార్యదర్శి కవిత, పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి నిర్లక్ష్యపు చెదలు

- సిబ్బంది ఇష్టారాజ్యం
- తూతూమంత్రంగా పనులు
- మొక్కల కిందే మొక్కలు నాటుతున్న కూలీలు
- పట్టని అధికారులు

మధురానగర్‌లో మొక్క కింద మొక్కను నాటిన ఉపాధిహామీ కూలీలు

గుంపుగా పక్కపక్కనే నాటిన మొక్కలు

గంగాధర, అక్టోబర్ 4: వన మహోత్సవానికి నిర్లక్ష్యపు చెదలు పట్టుకున్నది. పల్లెల్లో పచ్చదనం పెంచాలనే బృహత్తర లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం ఇష్టారాజ్యంగా సాగుతున్నది. అధికారుల పర్యవేక్షణ లోపం, ఉపాధిహామీ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుండగా, ఇందుకు గంగాధర మండలంలో పోగ్రాం నిర్వహణ తీరే నిదర్శనంగా నిలుస్తున్నది. మొక్కకు మొక్కకు మూడు మీటర్ల ఎడం ఉండేలా చూసి నాటించాల్సిన సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. గుంపులుగా ఎటువంటి కొలతలు లేకుండా ఇష్టం వచ్చినట్లు నాటారు. విద్యుత్ తీగల కింద వృక్ష జాతులు కాకుండా పూల మొక్కలు నాటాల్సి ఉండగా, అవేమీ పట్టించుకోకుండా వృక్షాలుగా మారే రకాలనే నాటేశారు. ఇక గతంలో విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు చెట్లుగా మారి కరెంటు సమస్యలు తలెత్తడంతో కరెంట్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. అది కూడా పట్టించుకోకుండా మళ్లీ ఆ చెట్ల పక్కనే ఉపాధిహామీ సిబ్బంది తిరిగి మొక్కలు నాటడం వారి అలసత్వానికి, అధికారుల పర్యవేక్షణలోపానికి అద్దం పడుతున్నది. అలాగే కొద్దిగా పెరిగిన మొక్క నీడలో మరో మొక్క నాటడం సిబ్బంది అవగాహనలేమికి నిదర్శంగా కనిపిస్తోంది. పై అధికారులు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ఉన్న ఆరాటం, మొక్కలు నాటడంతో లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై ఏపీవో లోకేశ్వరిని వివరణ కోరగా మొక్కకు మొక్కకు మూడు మీటర్ల దూరం ఉండాలని, విద్యుత్ తీగల కింద పూల మొక్కలు మాత్రమే నాటాలని, మొక్క కింద మొక్కను నాటరాదని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అడుగగా సమాధానం దాటవేశారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేస్తున్న ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణా కేంద్రం సిబ్బంది

విద్యానగర్, అక్టోబర్ 4: 'రక్తదానం చేయండి.. ప్రాణాలను నిలపండి' అని ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ లింగారెడ్డి సూచించారు. శుక్రవారం కరీంనగర్ ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణా కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం నిర్వహించగా, 34 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్లా రక్తదానం ఎంతో గొప్పనైనదన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ కుమార్, శిక్షణా కేంద్రం డాక్టర్లు కోటేశ్వరరావు, సాయి చైతన్య, దివ్య, సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి, జగన్, విశ్రాంత సహాయ సంచాలకులు జయరాములు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ విభాగ చైర్మన్ పీ కేశవ రెడ్డి, సెక్రటరీ వీ రాధాకృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

తెలంగాణచౌక్, అక్టోబర్ 4: ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీ, వైశ్యసేవా కేంద్రం సంయుక్తంగా నగరంలోని వైశ్య భవనంలో 6న నిర్వహిస్తున్న బంగారు బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, వైశ్య సేవ కేంద్రం అధ్యక్షుడు చిదురసురేష్, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చకిలం స్వప్న కోరారు. నగరంలోని ప్రెస్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, వైశ్య సేవ కేంద్రం కల్చరల్ అండ్ డివోషనల్ కో ఆర్టినేటర్ చంద్రశేఖర్, నాయకులు వెంకటేశం, శ్రీధర్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో డెలివరీ బాయ్ ఉద్యోగాలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 4: యూఏఈ(దుబాయ్)లో బైక్ రైడర్స్(డెలివరీ బాయ్స్) ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతి రావు తెలిపారు. 7న నెహ్రూ యువ కేంద్రంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఎంపికైన అభ్యర్థులకు సుమారు రూ. 65 వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు. 21 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సు ఉండి, ఇండియన్ డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి చదివిన వారు అర్హులని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని చెప్పారు. వివరాలకు 9440051285, 9440048500, 97010 40062, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని ఒక ప్రకటనలో చెప్పారు.

కరీంనగరంలో విద్యుత్ ఉద్యోగుల నిరసన

కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ముకరంపుర, అక్టోబర్ 4: రామగుండంలో నిర్మించబోయే 800మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణికి కట్టబెట్టవద్దని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ సర్కిల్ జేఏసీ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం జెన్‌కో నిర్వహిస్తున్న అన్ని జనరేటింగ్ స్టేషన్లు మంచి లాభాల్లో ఉన్నప్పటికీ, రామగుండం ప్లాంట్‌ను ప్రభుత్వం సింగరేణి కాలరీస్‌కు కట్టబెట్టడం సరైనది కాదని, ఇది విద్యుత్ సెక్టార్‌ను నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అంజయ్య, భాస్కర్, శ్రీనివాస్, సంపత్ కుమార్, సుధీర్ కుమార్, రఘుపతి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేయాలి

- **హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ అధికారి ఆర్వీ కర్ణన్**

చొప్పదండి పట్టణంలోని రెడ్డి కాలనీలో డిజిటల్ ఫ్యామిలీ సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ అధికారి ఆర్‌వీ కర్ణన్

చొప్పదండి, అక్టోబర్ 4: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫ్యామిలీ సర్వేను పకడ్బందీగా నమోదు చే యాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ అధికారి ఆర్వీ కర్ణన్ సూచించారు. 'తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే - పైలెట్ ఎక్సర్సైజు'లో భాగంగా చొప్పదండి పట్టణంలోని 7వ వార్డు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజు, చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆధ్వర్యంలో నాలుగు బృందాలతో 235 కుటుంబాల వివరాలు సేకరించగా, సర్వే తీరును ఆర్‌వీ కర్ణన్, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ పర్యవేక్షించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఎక్కడా తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కబడ్డీ అసోసియేషన్‌ను నంబర్ వన్‌గా నిలుపుతా

- **అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్ రావు**

జిల్లా